క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం



చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

చిల్లకూరు : గూడూరు పట్టణం కర్ణాల వీధిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాడ వీధి ఉత్సవం, స్నపన తిరుమంజనం, వసంతోత్సవం చేపట్టారు. తదుపరి స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం చేయించారు. భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన అనంతరం పూర్ణాహుతి చేపట్టారు.

వైభవంగా వసంతోత్సవం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని కరణాలవీధిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు చక్రస్నాన ఘట్టాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉభయదాతలుగా తూపిలి రామారావు, రాజేశ్వరి, శ్రీనివాసులు, పద్మజ వ్యవహరించారు.

కుట్టు మిషన్ వితరణ



పేద మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట టౌన్ : పేదరికంతో ఇబ్బంది పడుతున్న కోట మండలం కొత్తపాళెంకు చెందిన సారంగం శ్వేతకు శుక్రవారం నాయుడుపేటకు చెందిన బలిజ చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్ వితరణ చేశారు. వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పగడాల శివప్రదీప్, హంసా పృథ్వీచంద్, గడదాసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సైదాపురం: మండలంలోని గిద్దలూరు గ్రామంలో నెలకొన్న భూ సమస్యను రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంగా పరిష్కరించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ దృష్టికి బాధితులు గిద్దలూరు రోడ్డు విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రక్తహీనతపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో సునందన

రాపూరు: కిశోరి వికాశంలో భాగంగా రాపూరు సెక్టార్ పరిధిలో పరమటవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో సునందన రక్తహీనతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు నిత్యం పాలు, గుడ్లు, వేరుశనగ ముద్దలు, క్యారెట్, ఆకుకూరలు తీసుకుంటే రక్తహీనత సమస్య తలెత్తదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, కిశోర బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్ : ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం సచివాలయాల పరిధిలోని శానిటరీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ శనివారం గోమతి సర్కిల్ సమీపంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మొక్కలు నాటుతారని, ఆ ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో ఆర్టీసీ బస్టాండు నుంచి చాంద్రాయి చెరువు కాలువ వరకు పూడితతీత పనులు చేయించారు.

చెత్తతో సంపద సృష్టించాలి

కలువాయి(సైదాపురం): చెత్తతో సంపద సృష్టించాలని ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ నయామ్ హసన్‌తాజ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం కలువాయిలో పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్రపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్త తయారీ కేంద్రానికి తరలించి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా వచ్చిన ఆదాయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. అనంతరం కుల్లూరులోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

జోరుగా ఎడగారు వరినాట్లు



చిట్టమూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

చిట్టమూరు : మండలంలో బోరు నీటి వసతి ఉన్న రైతులు ఎడగారు వరినాట్లు వేస్తున్నారు. ముఖ్యంగా గునపాడు, మెట్టు, తిమ్మారెడ్డివాగు, ఆరూరు, ఎల్లసిరి, ఈశ్వరవాక, ఆలేటిపాడు, అరవపాళెం, తాడిమేడు, పెళ్లకూరు, అద్దెపూడి, జంగాలపల్లి, చిల్లమూరు, బయ్యావారికండ్రిగ గ్రామాల్లో 650 మంది రైతులు 4 వేల హెక్టార్లలో వరినాట్లు వేస్తున్నారు. స్వల్పకాలిక వరి వంగడాలైన ఎంటీయూ 1010, కేఎన్ఎం 16,38, ఆర్ఎన్ఆర్ 15048 సాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో ఎడగారులో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చిట్టమూరు మండలంలోని 20 చెరువులకు తెలుగు గంగ నీటిని విడుదల చేసేవారు. ఈ ఏడాది కూడా తెలుగు గంగ నీరు విడుదల చేస్తారనే ఉద్దేశంతో అనేక మంది రైతులు వరినారు పోశారు. నారు ముదిరిపోతున్నా గంగ నీరు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెరువులకు తెలుగు గంగ నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

డక్కిలి మండలంలో..

డక్కిలి: మండలంలోని రైతులు వరి పైరు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడం, మరో వైపు తెలుగుగంగ కాలువకు నీటిని విడుదల చేయడంతో డక్కిలి, లింగసముద్రం, చాకలపల్లి, నాయుడుపాళెం, పాతనాలపాడు, వడ్ల మోపూరు, దగ్గవోలు, చాపలపల్లి, నాగవోలు, చెన్నసముద్రం, వెలికల్లు, వడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులు పొలాలను దుక్కిదున్నుతున్నారు. ఇప్పటికే కొంత మంది వరినారు పోశారు. ఈ ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా సుమారు 1500 హెక్టార్లలో వరి పంట సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారిణి విజయభారతి తెలిపారు. 1010, నెల్లూరు మసూరా రకాలను ఎక్కువగా సాగు చేస్తారని వెల్లడించారు.







డక్కిలి: నాయుడుపాళెంలో నారుముడులకు నీరు పెట్టుతున్న దృశ్యం, చాకలపల్లిలో జీలుగ సాగు చేసిన రైతులు, చిట్టమూరు : అరవపాళెం గ్రామంలో నారు ముదిరిపోవడంతో వదిలేసిన నారుమడి

ఘనంగా చండీ యాగం

చిట్టమూరు : మండలంలోని తాడిమేడు గ్రామ దేవత మణికట్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నిర్మాణం చేసి చాలా కాలం కావడంతో అమ్మవారికి తిరిగి శక్తులు వచ్చేలా యాగం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, ప్రధాన కలశ స్థాపన, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కాల్వ భక్తవత్సలనాయుడు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అకాల వర్షాలకు పశువుల్లో రోగాలు

బాలాయపల్లి(సైదాపురం) : అకాల వర్షాల వల్ల పశువుల్లో అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని పశువైద్యాధికారి సుధీర్ తెలిపారు. ఆయన శుక్రవారం మన్నూరుమిట్ట గ్రామంలో గేదెలకు వడదెబ్బ తగలడంతో చికిత్స చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజుల నుంచి అప్పుడప్పుడు వర్షం కురుస్తోందని తెలిపారు. దీంతో నాచుకి నత్తలు అంటుకుని ఉంటాయని, ఆ గడ్డిని పశువులు తినడం వల్ల వ్యాధులు వస్తాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోరువెచ్చని నీటిని గేదెలకు తాగించాలన్నారు.

చెంగాళమ్మకు ఇస్రో చైర్మన్ పూజలు

- పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం విజయవంతం కావాలని ప్రార్థన



ఇస్రో చైర్మన్ నారాయణన్‌కు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు, అధికారులు

సూళ్లూరుపేట : పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ ఇస్రో చైర్మన్ కె.నారాయణన్ శుక్రవారం రాత్రి సూళ్లూరుపేట చెంగాళమ్మకు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్న లక్ష్మీ సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి ఆస్థాన మండపంలో సత్కరించి తీర్ద ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇస్రో చైర్మన్ కె.నారాయణన్ విలేకరులతో మాట్లాడారు. పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగానికి సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నామని తెలిపారు. 22 గంటల తర్వాత ఆదివారం ఉదయం 5.59 గంటలకు ప్రయోగాన్ని నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశామని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారిని ప్రార్థించినట్టు పేర్కొన్నారు. అమ్మవారి సంకల్ప బలం వుంటే ఎలాంటి పనైనా విజయవంతమవుతుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సైదాపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ఆయన శుక్రవారం సైదాపురం మండలంలోని తిప్పిరెడ్డిపల్లిలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించి వివరాలను ఆరా తీశారు. రీసర్వే చేసే గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. గ్రామంలో వున్న 255 ఎకరాల మేత పొరంబోకు భూములను నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆ భూములను కొందరు 5 నుంచి 10 ఎకరాల చొప్పున ఆక్రమించుకున్నట్టు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయన సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగుల గదిలో వాటర్ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందడం లేదు



పాఠశాలల విలీనంపై ఎంఈవోను నిలదీస్తున్న అక్కరపాక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

దొరవారిసత్రం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో పేదలకు వైద్యం అందడం లేదని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, గోపిరెడ్డి, మస్తాన్, కోఆప్షన్ సభ్యుడు మౌలా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్త విధానం పేరుతో పాఠశాలలను విలీనం చేస్తూ ప్రభుత్వమే ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తోందని వాపోయారు. దీంతో నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యకు దూరమవుతున్నారని ఆరోపించారు. వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో వైద్య సేవలను సక్రమంగా అందించడంలేదన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా మండలానికి 200 బస్తాలు దానా వస్తే ఎలా సరిపోతుందని అధికారులను ప్రశ్నించారు. డీవీ సత్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగడం లేదని, దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన, తహసీల్దార్ శైలకుమారి, ఎంఈవో కృష్ణయ్య, అధికారులు శారదాంబ, ఉమామహేశ్వరి, జ్యోతిర్మయి, వెంకటేశ్వర్లు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు సహకరించాలి



వాకాడు : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్



నాయుడుపేట ర్యాలీలో ఎమ్మెల్యే విజయశ్రీ

వాకాడు : దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో వాకాడులో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందని తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో అమాయకులు మృతిచెందుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా చేపట్టిందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీ గాంధీ పార్కు నుంచి పాత బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అమరులైన వీర జవాన్లకు జోహర్లు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్, చెవూరి చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మోహినీ ఉత్సవం



గజ. సింహ వాహనాల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారు మోహిని ఆలంకారంతో భక్తులను అనుగ్రహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చప్పర ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ చేశారు. శనివారం స్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్టు టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్ తెలిపారు. రథోత్సవానికి వచ్చే భక్తులకు తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ తరఫున యువత అన్నదానం చేస్తున్నట్టు కామిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్‌బాబు, హరిరెడ్డి, మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్ రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌కుమార్ రెడ్డి, నల్లారెడ్డి శివకుమార్ రెడ్డి, కరిమాణిక్యస్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మన మిత్ర ఆవిష్కరణ

సైదాపురం: ప్రభుత్వం 'మన మిత్ర' పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిందని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సచివాలయ సిబ్బందికి మిత్ర స్టాండ్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ గవర్నెన్స్ సేవలు పొందేందుకు 9552300009ను సంప్రదించాలన్నారు.

కండలేరులో 43.792 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 43.792 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,300, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వెలగని వీధి లైట్లు

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు టెంకాయ తోపు కాలనీలో కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీ చుట్టూ పొలాలు ఉండడంతో విష సర్పాలు వస్తున్నాయని, రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వేయాలని కోరుతున్నారు.

తుమ్మాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

చిట్టమూరు : మండలంలోని ఈశ్వరవాక పంచాయతీ మన్నెమాల గ్రామ దేవత తుమ్మాలమ్మ వార్షిక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను మూడు రోజులు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. మొదటి రోజు గణపతి పూజతో అంకురార్పణ చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోట: విద్యానగర్‌లోని 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీ చిన్నయ్య తెలిపారు. కోట, కొత్తపాళెం, ఉత్తమ నెల్లూరు, సిద్ధవరం, వంజివాక సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో మహిళ నిరసన



కలువాయి (సైదాపురం) : ఇళ్ల స్థలాల విషయంలో తమకు న్యాయం జరగలేదని ఒక మహిళ శుక్రవారం కలువాయి తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలిపింది. ఆమె మాట్లాడుతూ మండలంలోని నాయీబ్రాహ్మణకాలనీలో ఇళ్ల ప్లాట్ల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు తహసీల్దార్‌ను కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ శ్యామ్ సుందర్ వివరణ ఇస్తూ స్థలాల ఘర్షణపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇద్దరు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

కోట : మండలంలోని కేసవరం సచివాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ విధుల్లో అలసత్వం వహించినట్లు తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగశిలల ప్రతిష్ట



ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగ శిలలు, రాహుకేతువు విగ్రహాలకు శుక్రవారం ప్రాణప్రతిష్ట చేశారు. సాయంత్రం కలశ పూజ, గణపతి, సుబ్రహ్మణ్య రుద్ర హోమాలు జరిపారు. రాత్రి నాగశిలలు, రాహుకేతు విగ్రహాలకు ధాన్యాధివాసం చేపట్టారు. శనివారం ప్రత్యేక పూజలు, ఆదివారం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేస్తామని ఆలయ ధర్మకర్త చడలవాడ మోహన్ కృష్ణశర్మ తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు.

జగన్‌ను కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తలపై కూటమి నేతలు చేస్తున్న కక్షసాధింపు చర్యలను వివరించారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సైదాపురం: అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఖలీల్ కోరారు. వారు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కలువాయి జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డి, సైదాపురం, కలువాయి మండలాల కన్వీనర్లు రవికుమార్, కృష్ణారెడ్డి, వరదబండి ప్రభాకర్‌రెడ్డి, కంభం విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల నమోదులో గందరగోళం



చిల్లకూరు సచివాలయంలో ఫోన్ చూస్తున్న డిజిటల్ అసిస్టెంట్

పెళ్లకూరు: కొత్త రేషన్ కార్డుల నమోదులో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం, పలు సర్టిఫికెట్లు జత చేయాలని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు హుకుం జారీ చేస్తుండడంతో గందరగోళం నెలకొంది. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల కోసం 312 దరఖాస్తులు అందాయి. చిల్లకూరు తదితర సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో దరఖాస్తుదారులకు తిప్పలు తప్పడం లేదు. పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుని రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారికి సైతం మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేయాలని మెలిక పెట్టడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు అందుబాటులో ఉన్నప్పటికి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జత చేయాలంటూ మెలిక పెట్టడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంపై ఎంపీడీవో ప్రమీలారాణిని వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చిల్లకూరు : మండలంలోని తిక్కవరం, కలవకొండ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాలువల పూడికతీత పనులను శుక్రవారం ఉపాధి ఏపీవో గిరిబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ పంట కాలం పూర్తయిన తర్వాత పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరారని తెలిపారు. క్షేత్ర సహాయకుల ద్వారా ఎస్టిమేషన్లు వేయించి అవసరమైన చోట పంట కాలువల్లో పూడికతీత పనులు చేపడతామన్నారు. క్షేత్ర సహాయకులు అశోక్, నల్లయ్య పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని దగ్గవోలులో జరుగుతున్న ఉపాధి పనులను ఈసీ దామోదర్‌రాజు పరిశీలించారు. వేసవిలో ఎండలు ఎక్కువగా వున్నాయని, ఉదయమే పనుల్లోకి వచ్చి త్వరగా ఇంటికి వెళ్లిపోవాలని కూలీలకు సూచించారు. ఎప్పటికప్పుడు మస్టర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

తలుపూరు వ్యవసాయ సహాయకురాలి మృతి



సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తున్న వరిగొండ రేవతి(26) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆమె ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

గూడూరు రూరల్ : జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు గూడూరు పట్టణంలోని తూ ర్పువీధి, పూలతోట ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు : డెంగీతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గూడూరు పట్టణంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రేష్మా యాస్మిన్, శకుంతల, రామరాజు పాల్గొన్నారు.